# సాక్షి నల్లగొండ

శనివారం ၊ 11 ၊ మార్చి ၊ 2023






**పోరాడి పైకిరావాలి**

విద్యార్థులు తాము ఎంచుకున్న రంగంలో పోరాడి పైకి రావాలని హై కోర్టు జడ్జి జస్టిస్ లక్ష్మణ్ సూచించారు. - 8లో



**బీసీ బిల్లు ప్రవేశపెట్టాలి**

పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. - 10లో

గరిష్టం/కనిష్టం 35°/19°

**వాతావరణం**

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

## న్యూస్‌రీల్

### ఉత్తమ ఫలితాలు సాధించాలి



మాట్లాడుతున్న డీఈఓ భిక్షపతి

**చింతపల్లి :** పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఈఓ భిక్షపతి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, మోడల్ స్కూల్, ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు సమీపిస్తుండడంతో విద్యార్థులు ప్రణాళికబద్ధంగా చదవాలని సూచించారు. ఆయన వెంట ఎంఈవో గురువారావు, కస్తూ రిబా ప్రత్యేకాధికారి వాసవి, మోడల్ స్కూల్ హెచ్‌ఎం రయిస్‌ఉన్నిసాబేగం తదితరులున్నారు.

**రాష్ట్రపతి భవన్ సందర్శనకు అవకాశం**

**నల్లగొండ :** సికింద్రాబాద్ బొల్లారంలోని రాష్ట్రపతి భవన్‌ను పాఠశాల విద్యార్థుల సందర్శించేందుకు అవకాశం కల్పించినట్లు డీఈఓ భిక్షపతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 23వ తేదీ నుంచి ప్రభుత్వ పరిధిలోని అన్ని పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులను రాష్ట్రపతి భవన్ సందర్శనకు తీసుకెళ్లేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

### అంతర పంటల సాగుతో లాభాలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

**మాడుగులపల్లి :** అంతర పంటల సాగుతో లాభాలు పొందవచ్చని జయశంకర్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో 'రావేప్‌-రూలర్ అవేర్‌నెస్ వర్క్ ఎక్స్‌పీరియన్స్ ప్రోగ్రామ్'లో భాగంగా శుక్రవారం గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు సేంద్రియ ఎరువుల వినియోగం, అంతర పంటల సాగు, చీడపీడల నివారణ పద్ధతులపై అవగాహన కల్పించారు. గ్రామ నక్ష, సామాజిక, వనరుల, కాలక్రమ అంశాలను పటాల ద్వారా వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులు అజయ్, కుమార్, నాగరాజు, మహేశ్, యాకన్న, సంతోష్, శరత్, రైతులు సాల్విన్, వెంకట్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

### నేటి నుంచి ఉమ్మడి జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రంజిత్‌యాదవ్

**పెద్దవూర :** మండలంలోని గర్నెకుంట గ్రామంలో యాదవుల ఆరాధ్యదైవం గంగమ్మ జాతర సందర్భంగా శ్రీకృష్ణ యూత్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాస్థాయి గ్రామీణ ఇన్విటేషన్ కబడ్డీ టోర్నమెంట్‌ను శనివారం నుంచి నిర్వహిస్తున్నారు. కబడ్డీ టోర్నమెంట్ కరపత్రాలను శుక్రవారం బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు మన్నెం రంజిత్‌యాదవ్ ఆవిష్కరించారు. ఈ పోటీల్లో విజేతలకు మొదటి బహుమతి రూ.35వేలు, రెండవ రూ.30వేలు, మూడవ రూ.25వేలు, నాలుగో రూ.20వేలు, ఐదవ 15వేలు, ఆరవ రూ.12వేలు, ఏడవ రూ.10వేలు, ఎనిమిదవ రూ.8 వేలు, తొమ్మిదవ రూ.6 వేలు, పదవ బహుమతి రూ.4 వేలతో పాటు షీల్డులను అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో క్రీడల ఆర్గనైజర్స్ కట్టెబోయిన ఏడుకొండలు, మెండె ఏడుకొండలు, సుంకిరెడ్డి సంజీవరెడ్డి, నడ్డి నరేష్, పల్లెబోయిన సత్యనారాయణ, కలకొండ పరమేష్, కుంటిగొర్ల రాజశేఖర్, కాంసాని వంశీ, భిక్షమయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఖాళీ స్థలం | కనిపిస్తే ఖతం!

## మిర్యాలగూడలో పెరుగుతున్న భూ కబ్జాలు

- ఖాళీ ప్లాట్ కనిపిస్తే ఆక్రమిస్తున్న వైనం
- చర్యలకు సిద్ధపడిన అధికారులపై రాజకీయ ఒత్తిళ్లు
- భూ సెటిల్‌మెంట్లలో తలదూర్చుతున్న రౌడీ షీటర్లు
- కబ్జారాయుళ్ల ఆగడాలను కట్టడి చేయాలంటున్న ప్రజలు



ప్రభుత్వ భూమి చుట్టూ వేసిన కంచె

◆ మిర్యాలగూడ పట్టణానికి చెందిన ఓ చిరుద్యోగి పదేళ్ల క్రితం బాపూజీనగర్‌లో రెండు గుంటల స్థలం కొనుగోలు చేశాడు. పట్టణం విస్తరించింది. భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ఇంకేముంది ఖాళీగా ఉన్న ప్లాట్లపై కబ్జారాయుళ్ల కన్నుపడింది. పదేళ్ల క్రితం కొన్న భూమిలో చుట్టూ కంచె వేసేందుకు వెళ్లిన సదరు వ్యక్తికి అక్కడి వెళ్లగానే ఈ భూమి మాది అంటూ ముగ్గురు వ్యక్తులు అక్కడికి వచ్చి బెదిరింపులకు దిగారు. ఏమి చేయాలో పాలుపోని ఆ వ్యక్తి పోలీసులను ఆశ్రయించాడు. పక్కా పట్టాభూమి కావడంతో పాటు పహాణీ వంటి పత్రాలన్నీ ఆ వ్యక్తి పేరునే ఉన్నాయి. ఆధారాలన్నీ పోలీసులకు చూపిండంతో ఎలాంటి పత్రాలు లేని సదరు కబ్జాదారులు తోక ముడిచారు.

◆ పట్టణంలోని రవీంద్రనగర్ కాలనీలో ఓ ప్లాట్‌పై కబ్జారాయుళ్ల కన్నుపడింది. ఆ స్థలం యజమానికి తెలియకుండానే ఇంటి నిర్మాణం చేపట్టారు. ఓరోజు ఆ ప్లాట్ యజమాని వెళ్లి చూడగా షాక్‌కు గురయ్యాడు. తన ప్లాట్‌లో ఇంటి నిర్మాణం చేయడంపై మున్సిపల్ అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పనులు నిలిపివేయాలని అధికారులు హెచ్చరించారు. అయినా పనులు కొనసాగిస్తుండడంతో అడ్డుకునేందుకు వెళ్లిన స్థల యజమానితో పాటు అతడి కుటుంబ సభ్యులను కబ్జారాయుళ్లు విచక్షణా రహితంగా కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డారు. బాధితులు రూరల్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా రాజకీయ ఒత్తిళ్లతో ఇరువర్గాలపై పోలీసులు కేసు నమోదు చేయడం కొసమెరుపు.

**మిర్యాలగూడ అర్బన్ :** పారిశ్రామిక పరంగా అభివృద్ధి చెందుతున్న మిర్యాలగూడలో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ఈ నేపథ్యంలో పట్టణ శివారు కాలనీల్లోని ప్రభుత్వ భూములపై అక్రమార్కులు కన్ను పడింది. చోటామోటా రాజకీయ నాయకులు ప్రత్యక్షంగానో.. పరోక్షంగానో తలదూర్చి రూ.లక్షల విలువైన భూములను కాజేస్తున్నారు. దీంతో విలువైన ప్రభుత్వ భూములు పరాధీనంలోకి వెళ్లిపోతున్నాయి. వీటితోపాటు ప్రైవేట్ భూములను సైతం కబ్జా చేస్తున్నారు. వాటికి నకిలీ పత్రాలు సృష్టించి సెటిల్‌మెంట్లు చేస్తూ.. తమ అనుచరులను రంగంలోకి దింపి తమకు అనుకూలమైన వ్యక్తులకే ఆస్తులు దక్కేలా చేస్తున్నారని తెలుస్తోంది. సామాన్యులు వారు చెప్పినవారికే ఆస్తులను వదిలేస్తూ నిస్సహాయ స్థితిలోకి వెళ్లిపోతున్నారు.

**అడ్డుకుంటే దౌర్జన్యాలు..**

భూ ఆక్రమణదారులు తమవెంట తిరిగే రౌడీ షీటర్లను ప్రోత్సహించి కబ్జాలకు పాల్పడుతున్నట్లు పట్టణంలో ప్రచారం సాగుతోంది. తమ అనుచరులను కాపాలా పెట్టి అడ్డువచ్చిన స్థల యజమానులపై భౌతికదాడులకు దిగుతూ నిర్మాణాలు చేపడుతుండడం స్థానికులను భయాందోళనకు గురిచేస్తోంది. ఇలాంటి ఘటనలు కొన్ని పోలీస్ స్టేషన్ల వరకు వెళ్తున్నా.. మరికొన్ని ఘటనల్లో బాధితులు మిన్నకుండి పోతున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ, పోలీస్ అధికారులు స్పందించి కబ్జారాయుళ్ల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

**భూములను స్వాధీనం చేసుకుంటాం**

“ ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. భూములను సర్వే చేసి స్వాధీనం చేసుకుంటాం. ఎక్కడైనా ఆక్రమణకు గురైతే ప్రజలు మా దృష్టికి తీసుకురండి.

– అనిల్‌కుమార్, తహసీల్దార్, మిర్యాలగూడ

**చట్టపరంగా చర్యలు తీసుకుంటాం**



“ ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నట్లు సంబంధిత అధికారులు మాకు ఎలాంటి ఫిర్యాదు అందించలేదు. భూ వివాదాల కేసుల్లో ఆయా తహసీల్దార్ల నివేదికల ప్రకారం దర్యాప్తు చేపట్టి ప్రభుత్వ, ప్రైవేటు భుములను ఆక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– పి.వెంకటగిరి, డీఎస్పీ, మిర్యాలగూడ

**శివారు ప్రాంతాల్లోనే ఎక్కువగా..**

పట్టణ శివారు ప్రాంతంలో ఉన్న అసైన్డ్ భూములు రికార్డుల్లో మాత్రమే కనిపిస్తున్నాయి. మిర్యాలగూడ మున్సిపాలిటీ పరిధిలోని తాళ్లగడ్డ, రవీంద్రనగర్, చింతపల్లి బైపాస్‌రోడ్డు, హైదలాపురం, ఎఫ్‌సీఐకాలనీ, బాపూజీనగర్, ప్రకాశ్‌నగర్, తదితర ప్రాంతాల్లో భూ ఆక్రమణలు జరుగుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. పట్టణ శివారు ప్రాంతాల్లో రియల్టర్లు ఏర్పాటు చేసిన వెంచర్ల వెంట ఉన్న ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్నట్లు ఆరోపణలున్నాయి.

# సేవలతో అందరి మన్ననలు పొందాలి



భవనం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

- శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి
- మిర్యాలగూడలో రాజాబహదూర్ వెంకటరామిరెడ్డి విజ్ఞాన కేంద్రం నిర్మాణానికి శంకుస్థాపన

**మిర్యాలగూడ :** మిర్యాలగూడ రెడ్డి సంక్షేమ సంఘం అన్ని వర్గాల్లో ఉన్న పేదలకు తమ సేవలను అందించి మన్ననలను పొందాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఆకాంక్షించారు. శుక్రవారం పట్టణంలోని రెడ్డి సంక్షేమ సంఘం స్థలంలో చేపట్టిన రాజబహదూర్ వెంకటరామిరెడ్డి విజ్ఞాన కేంద్రం భవనం నిర్మాణ పనులకు ఆయన ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఈ భవన నిర్మాణానికి ఎమ్మెల్సీ నిధుల కింద రూ.50 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. విజ్ఞాన కేంద్రం భవనం త్వరగా పూర్తి చేసి అన్ని కులాలకు చెందిన రైతులు, మహిళలు, యువకులకు ఉపాధి రంగంలో శిక్షణ అందించాలని సూచించారు. వ్యవసాయ రంగంలో ఎక్కువగా రెడ్డి కులస్తులు ఉంటారని.. రైతులను ఆదుకోవాలనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ రైతుబంధు పథకాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ విజ్ఞాన వికాస కేంద్ర భవనం నిర్మాణానికి తనవంతుగా సహాయ, సహకారాలు అందిస్తానన్నారు. ఆగ్రోస్ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి, మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ మాట్లాడుతూ రెడ్డి సంక్షేమ సంఘం అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పేదలను ఆదుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మిర్యాలగూడ రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు అనుముల మధుసూదన్‌రెడ్డి, ఎంపీపీ నూకల సరళాహనుమంతరెడ్డి, కౌన్సిలర్లు శాగా జయలక్ష్మీజలంధర్‌రెడ్డి, వంగాల నిరంజన్‌రెడ్డి, నాయకులు కంచర్ల అనంతరెడ్డి, చన్నారెడ్డి, లింగారెడ్డి, నరేందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, నామిరెడ్డి నరేందర్‌రెడ్డి, నామిరెడ్డి యాదగిరిరెడ్డి, యరమాద వెంకట్‌రెడ్డి, చిలుక అనంతరెడ్డి, రాంరెడ్డి, పిట్ట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# నాటికలతో ప్రజల్లో చైతన్యం తేవాలి



మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి



నాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి
- జాతీయ స్థాయి పద్య, సాంఘిక నాటిక పోటీలు ప్రారంభం

**మిర్యాలగూడ :** నాటికలతో ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి కోరారు. మిర్యాలగూడలోని శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, మిర్యాలగూడ సాంస్కృతి కళా కేంద్రం సంయుక్త నిర్వహణలో ఏర్పాటు చేసిన జాతీయ స్థాయి పద్య, సాంఘిక నాటిక పోటీలను శుక్రవారం ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పద్య, సాంఘిక నాటికలు సందేశం ఇచ్చే విధంగా ఉండాలన్నారు. సమాజంలోని రుగ్మతలు, ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను కండ్లకు కట్టినట్లుగా ప్రదర్శించి ప్రజలను చైతన్యవంతులు చేయాలని సూచించారు. కళాకారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తారని చెప్పారు. అనంతరం గుంటూరు జిల్లాలోని రేపల్లెకు చెందిన గురుమిత్ర కళాసమితి నిర్వహించిన కొండ సాంఘీక నాటకం ఆకట్టుకుంది. కార్యక్రమంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, కళా కేంద్రం అధ్యక్ష, కార్యదర్శులు బోయినపల్లి భుజంగరావు, పులి కృష్ణమూర్తి, ప్రచార కార్యదర్శి మామిడాల ఉపేందర్, నిర్వహణ కార్యదర్శి పి.రామవతారం, కోశాధికారి పి.లక్ష్మీనారాయణశర్మ తదితరులు పాల్గొన్నారు.

# చేతివృత్తులను ఆదరించాలి

**మిర్యాలగూడ :** చేతివృత్తుల కళాకారులు తయారు చేసిన వస్తువులను ప్రతి ఒక్కరు ఆదరించాలని అదనపు కలెక్టర్ కుష్బూ గుప్తా కోరారు. శుక్రవారం పట్టణంలో నాబార్డ్ కళాభారత చేతివృత్తుల సంఘం గ్రామీణ మేళాను ఆమె ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో కళాకారులు తయారుచేసిన వస్తువులను పట్టణాల్లో విక్రయించేందుకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించేలా నాబార్డ్ మరిన్ని ప్రదర్శనలు చేపట్టాలని సూచించారు. నాబార్డ్ డీడీఎం వినయ్‌కుమార్ మాట్లాడుతూ 15 రోజుల పాటు ఏర్పాటు చేసే ఈ ప్రదర్శనలో ఇతర రాష్ట్రాల, జిల్లాల నుంచి చేతివృత్తుల వారి వస్తువులు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవీందర్‌సాగర్, ఏపీజీవీబీ మేనేజర్ శ్రీనివాస్, డీపీఎం రామలింగయ్య, జెల్లా సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

**నర్సరీల పరిశీలన**

మండలంలోని తక్కెళ్లపాడు, యాద్గార్‌పల్లి గ్రామాల్లోని నర్సరీలను అదనపు కలెక్టర్ కుష్బూ గుప్తా పరిశీలించారు. తక్కెళ్లపాడు గ్రామంలో వ్యర్థాలతో ఎరువులు తయారు చేస్తున్న తీరును ఆమె తెలుసుకున్నారు. ఆమె వెంట ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి, ఎంపీఓ వీరారెడ్డి తదితరులు ఉన్నారు.



నర్సరీని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా

# ఇంటర్ పరీక్షలకు అంతా సిద్ధం

- జిల్లాలో 47 పరీక్ష కేంద్రాల ఏర్పాటు
- 20 మందికి ఒక ఇన్విజిలేటర్‌ను నియమించాం
- 2 ఫ్లయింగ్ స్క్వాడ్, 4 సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు చేస్తాయి
- కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాం
- డీఐఈఓ దస్రూనాయక్

సాక్షి INTERVIEW



డీఐఈఓ దస్రూనాయక్

**నల్లగొండ :** ఇంటర్మీడియట్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఈనెల 15 నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 9గంటల నుంచి 12గంటల వరకు పరీక్ష నిర్వహిస్తాం. ఏప్రిల్ 4వ తేదీ వరకు పరీక్షలు కొనసాగుతాయి. ఈ పరీక్షలకు మొదటి సంవత్సరం 14,915 మంది, ద్వితీయ సంవత్సరం 15,761 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. ప్రైవేటు కళాశాలల్లో హాల్‌టికెట్లు ఇవ్వకపోతే విద్యార్థులు ఆన్‌లైన్‌లో హాల్ టికెట్‌ను డౌన్‌లోడ్‌చేసుకొని పరీక్షకు హాజరు కావొచ్చని జిల్లా ఇంటర్ విద్యాధికారి దస్రూనాయక్ తెలిపారు. శుక్రవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

**ప్రతీక్‌రెడ్డి కాలేజీలో రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్**

విద్యార్థులు ఆయా గ్రామాల నుంచి పరీక్ష కేంద్రాలకు వచ్చేందుకు గాను 19 రూట్లలో బస్సు సౌకర్యం కల్పిస్తున్నాం. రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను నల్లగొండలోని కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేశాం. స్ట్రాంగ్ రూంలను కూడా అక్కడే ఏర్పాటు చేస్తున్నాం. పరీక్షలకు సంబంధించిన మెటీరియల్ అంతా సిద్ధంగా ఉంచాం. పరీక్షలకు సంబంధించి ప్రశ్నపత్రాలు జిల్లాకు చేరాయి. రిసెప్షన్ సెంటర్‌లో భద్రపరిచాం. వాటిని తిరిగి రెండు రోజుల తర్వాత పరీక్ష కేంద్రాలకు సమీపంలో ఉన్న పోలీస్‌స్టేషన్లలో భద్రపరుస్తాం. పరీక్ష నిర్వహించే రోజు 8.30 గంటలకు పోలీస్‌స్టేషన్ నుంచి పరీక్ష కేంద్రాలకు ప్రశ్నాపత్రాలు తీసుకెళ్తారు. పరీక్ష ముగిసిన తర్వాత వాటిని తిరిగి పోస్టాఫీస్‌లకు తీసుకొచ్చి అక్కడి నుంచి రిసెప్షన్ అండ్ డిస్ట్రిబ్యూషన సెంటర్ అయిన ప్రతీక్ జూనియర్ కళాశాలకు తరలిస్తారు. అక్కడి నుంచి ఇతర జిల్లాలకు పంపుతారు.

**జిల్లాలో 47 పరీక్ష కేంద్రాలు..**

ఇంటర్మీయట్ పరీక్ష నిర్వహణకు సంబంధించి మొత్తం 47 సెంటర్లను ఏర్పాటు చేశాం. 12 ప్రభుత్వ కళాశాలల్లో, 3 మోడల్ స్కూల్‌లు, 10 రెసిడెన్షియల్ స్కూల్‌లు, 22 ప్రైవేటు స్కూళ్లలో పరీక్ష కేంద్రాలు ఉన్నాయి. 47 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 47 మంది డీఓలు 8 మంది కస్టోడియన్లు, 2 ఫ్లెయింగ్, 4 సిట్టింగ్ స్క్వాడ్లను, 20 మంది విద్యార్థులకు ఒక ఇన్విజిలేటర్‌ను నియమించాం. పరీక్ష విధివిధానాలకు సంబంధించి కో ఆర్డినేషన్ సమావేశం కూడా నిర్వహించాం. ఎగ్జామినేషన్ కమిటీని ఏర్పాటు చేశాం. తనతోపాటు ఇద్దరు సీనియర్ ప్రిన్సిపాల్స్, ఒక జూనియర్ లెక్చరర్‌ను కూడా కమిటీలో సభ్యులుగా ఉంచాం. హైపవర్ కమిటీలో కలెక్టర్, ఎస్పీ, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, ఒక సబ్జెక్టు లెక్చరర్‌ను కూడా నియమించాం.

# మహిళలు చైతన్యవంతం కావాలి



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి దీప్తి

**రామగిరి(నల్లగొండ) :** మహిళలు చైతన్యవంతులుగా ఎదగాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కారదర్శి దీప్తి పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా కోర్టులోని న్యాయ సేవా సదన్ భవనంలో శుక్రవారం మహిళకు చట్టపరమైన హక్కులు సాధికారత అంశంపై న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు అధైర్య పండకుండా సంఘంలో నైతికంగా రాణించాలని సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా న్యాయ సహాయం, న్యాయ సలహా, చట్టాలపై అవగాహన కల్పించడం లోక్ అదాలత్ ద్వారా ద్వారా కేసులు పరిష్కరిస్తుందని తెలిపారు. కుటుంబ చట్టాలు, గృహహింస, వరకట్న నిషేధం తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అరోరా లా కాలేజీ ప్రిన్సిపాల్ యాదయ్య, న్యాయవాదులు ఎస్.భీమార్జున్‌రెడ్డి, కెవి రమణారావు తదితరులు పాల్గొన్నారు.

# స్త్రీనిధి బకాయిలు.. రూ.14.31 కోట్లు

- తీసుకున్న రుణాలు తిరిగి చెల్లించని 1,524 స్వయం సహాయక సంఘాలు
- వసూళ్ల కోసం తంటాలు పడుతున్న బ్యాంకర్లు
- కొందరు చనిపోవడం, మరికొందరు వలసెళ్లడమే కారణం



**చందంపేట** మండలానికి చెందిన ఓ మహిళా స్వయం సహాయక సంఘం 2016లో రూ.5లక్షల రుణం తీసుకుంది. ఈ రుణాన్ని సంఘంలోని 10 మంది సభ్యులు పంచుకున్నారు. తీసుకున్న రుణం ప్రతినెలా చెల్లించాలి కానీ సగం నెలలు మాత్రమే చెల్లించారు. ఆ తర్వాత ఇద్దరు సభ్యులు చెల్లించపోవడంతో మిగతావారు కూడా మానేశారు. దీంతో సగం అప్పు అలానే ఉంది. అప్పటి నుంచి ఆ సంఘం బకాయిలు పేరుకుపోయాయి. ఈ పరిస్థితి జిల్లా అంతటా నెలకొంది.

**నల్లగొండ:** స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న రుణాలు తీసుకున్న మహిళలు తిరిగి సక్రమంగా చెల్లించడం లేదు. దీంతో జిల్లావ్యాప్తంగా 1,524 సంఘాలు రూ.14.31 కోట్లు బకాయి పడ్డాయి. బ్యాంకుల్లో అప్పు తీసుకున్న డబ్బులు కొన్ని సంవత్సరాలుగా తిరిగి చెల్లించక పోవడం వల్ల బకాయిలు పేరుకుపోయాయి. అప్పులు తీసుకున్న సంఘాల్లోని కొందరు సభ్యులు బతుకు దెరువుకోసం ఇతర పట్టణ ప్రాంతాలకు వలసలు పోగా, మరికొంత మంది చనిపోయారు. ఇంకొందరు మాత్రం చెల్లించని వారిని సాకుగా తీసుకొని వారు కూడా చెల్లించని పరిస్థితి నెలకొంది.

**నెరవేరని ప్రభుత్వ లక్ష్యం..**

మహిళా సాధికారతే లక్ష్యంగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోంది. దీంట్లో భాగంగా డీఆర్‌డీఏ ద్వారా మహిళా అభివృద్ధికి పొదుపు స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేసింది. 10 నుంచి 15 మంది మహిళలు గ్రూపుగా ఏర్పడి ప్రతినెలా కొంత డబ్బును పొదుపు చేసుకోవాలి. అలా చేసిన సంవత్సరం తర్వాత బ్యాంకు లింకేజి కింద ఆ సంఘానికి రుణం అందిస్తారు. మహిళలు ఆ డబ్బుతో గ్రూపుగా, వ్యక్తిగతంగా వ్యాపారం చేసుకోవచ్చు. రుణాలు పొంది కొందరు వ్యాపారం చేస్తుండగా.. మరి కొందరు పిల్లల చదువులు, ఇతర అవసరాలకు వాడుకుంటున్నారు. రుణాన్ని తిరిగి ప్రతినెలా వడ్డీతోపాటు చెల్లించాలి. క్రమం తప్పకుండా చెల్లించిన సంఘాలకు ప్రభుత్వం తిరిగి వడ్డీని చెల్లిస్తుంది. కానీ ప్రస్తుతం కొన్ని సంఘాలు తీసుకున్న రుణాలను చెల్లించకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు.

**బ్యాంకు సిబ్బందికి వసూళ్ల తిప్పలు**

కొందరు సభ్యులు వివిధ కారణాల చేత తీసుకున్న అప్పు చెల్లించక పోవడంతో మిగిలిన వారు కూడా మొండికేస్తున్నారు. దీంతో సంబంధిత బ్యాంకుల సిబ్బందికి వసూళ్ల తిప్పలు తప్పడం లేదు. ఎంత చెప్పినా కొందరు సభ్యులు తీసుకున్న రుణాలు చెల్లించేందుకు ఆసక్తి చూపకపోవడంతో బకాయిలు పేరుకుపోతూనే ఉన్నాయని బ్యాంకుల సిబ్బంది అంటున్నారు.

**నష్టపోతున్న మిగిలిన సభ్యులు..**

ఒక్కరిద్దరు సభ్యులు తీసుకున్న అప్పుకు సంబంధించి డబ్బులు చెల్లించకపోవడంతో క్రమం తప్పకుండా చెల్లించే వారికి ఇబ్బందికరంగా మారింది. తీసుకున్న రుణం తిరిగి చెల్లిస్తే ఆ సంఘానికి మళ్లీ అధికంగా రుణాన్ని ఇస్తారు. కొందరు చెల్లించకపోవడం వల్ల అప్పుతీరక పోవడంతో మిగిలిన సభ్యులు తిరిగి రుణాన్ని పొందలేక నష్టపోతున్న పరిస్థితులు దాపురించాయి.

# 16 నుంచి 'శ్రీవల్లి' ప్లాట్ల వేలం

- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

**నల్లగొండ :** నార్కట్‌పల్లి మండలం ఎల్లారెడ్డిగూడెం సమీపంలో ఎంజీ యూనివర్సిటీ ఎదురుగా ఉన్న రాజీవ్ స్వగృహ శ్రీవల్లి టౌన్‌షిప్‌లో ఓపెన్ ప్లాట్లు, పాక్షిక నిర్మాణ గృహాలకు ఈ నెల 16,17,18 తేదీల్లో నాలుగో విడత బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో ప్రీ బిడ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాజీవ్ స్వగృహ శ్రీవల్లి టౌన్‌షిప్‌లో రహదారులు, విద్యుత్, డ్రెయినేజీ తదితర సౌకర్యాల కల్పనకు పనులు ప్రారంభమైనట్లు తెలిపారు. ఈ లేఅవుట్ పూర్తిగా ప్రభుత్వమే చేస్తున్నందున ఎలాంటి అనుమానాలు, సందేహాలు అవసరం లేదన్నారు. ప్లాట్లు, గృహాల కొనుగోలుకు ఎస్‌బీఐ, ఐసీఐసీఐ బ్యాంకులు కూడా నిబంధనల మేరకు రుణం మంజూరు చేస్తున్నాయని తెలిపారు. శ్రీ వల్లి టౌన్ షిప్‌లో 133 ఓపెన్ ప్లాట్‌లు, 253 పాక్షిక నిర్మాణ గృహాలకు మార్చి 16, 17, 18 తేదీల్లో కలెక్టరేట్‌లో ఉదయాదిత్య భవన్‌లో వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వీటికి కనీస ధర ఓపెన్ ప్లాట్‌కు చదరపు గజానికి రూ.6 వేలు, పాక్షిక నిర్మాణ గృహాలకు నిర్మాణ దశను బట్టి చదరపు గజానికి రూ.6 వేల నుంచి రూ.10,500గా నిర్ణయించినట్లు తెలిపారు. ప్రత్యక్ష వేలంలో పాల్గొనేవారు దరావతు కింద రూ.10 వేల చెల్లించాలని చెప్పారు. ఇతర వివరాలకు nalgonda.telangana.gov.in వెబ్ సైట్‌ను గానీ, సైట్ కార్యాలయం (ఫోన్ నంబర్ 91543 39209)లోగానీ సంప్రదించవచ్చని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు ఖుష్బూ గుప్తా, భాస్కర్‌రావు, గృహ నిర్మాణ పీడీ రాజ్‌కుమార్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ప్రీ బిడ్ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి తదితరులు

## క్లుప్తంగా

### అవమానపరిచారని ఫిర్యాదు

కోదాడ: కోదాడ ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్‌పై కోదాడ మున్సిపల్ చైర్‌పర్సన్ వనపర్తి శిరీష రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావుతో పాటు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. పట్టణ ప్రథమ పౌరురాలిగా, కోదాడ ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యురాలిగా ఉన్న తనకు ఈనెల 8న మహిళా దినోత్సవం రోజునే తనను అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ రోజు వైద్యశాలలో డయాలసిస్ సెంటర్ ప్రారంభోత్సవం చేశారని కానీ దీనికి సంబంధించి కనీస సమాచారం ఇవ్వలేదని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై విచారించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

### పాము కాటుతో రైతు మృతి


వీరయ్య (ఫైల్)

అర్వపల్లి: పాము కాటుతో రైతు మృతిచెందాడు. ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. జాజిరెడ్డిగూడెంనకు చెందిన రైతు, మత్స్య కార్మికుడు గీస వీరయ్య(52) శుక్రవారం పొలం వద్దకు వెళ్లి వ్యవసాయ పనులు చేసుకుంటుండగా పాము కాటు వేసింది. చికిత్సకోసం తీసుకెళ్లేలోపే మరణించినట్లు మృతుడి కుటుంబీకులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కాగా మృతునికి జడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్, టీఎంపీఎస్ చైర్మన్ ఈదునూరి సంతోష్‌ముదిరాజ్, మూసీ మత్స్య సంఘం మాజీ చైర్మన్ సాదుల నర్సయ్య, ఇటుకులపహాడ్ సర్పంచ్ అల్లి సైదులు, రైతుబంధు సమితి అధ్యక్షుడు మామిడి సత్యనారాయణ, మామిడి విజయ్, సురేష్ తదితరులు నివాళులర్పించారు.

# రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

పెద్దవూర : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం చెందారు. పెద్దవూర, తిర్మలగిరి మండలాల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. నిడమనూరు మండలం నర్సింహులగూడెం గ్రామానికి చెందిన బాణావత్ వరుణ్ అలియాస్ బన్నీ(17), ఇంద్రకంటి సుమంత్(18)లు హైదరాబాద్‌లో ఉంటున్నారు. తమ స్నేహితుని వివాహానికి హాజరుకావటానికి శుక్రవారం స్కూటీపై తమ స్వగ్రామమైన నర్సింహులగూడేనికి వస్తున్నారు. ఈ క్రమంలో మండల కేంద్రం సమీపంలోని నాగార్జునసాగర్–హైదరాబాద్ ప్రధాన రహదారిపై విశ్వనాథ్ స్పిన్నింగ్ మిల్ సమీపంలోని బస్ బే వద్దకు రాగానే అతివేగంగా వస్తున్న బొలేరో వాహనం వీరు ప్రయాణిస్తున్న స్కూటీని ఎదురుగా ఢీ కొట్టింది. దీంతో స్కూటీ వెనక కూర్చున్న బాణావత్ వరుణ్ రోడ్డుపై పడటంతో తలఛిద్రమై అక్కడికక్కడే మృతి చెందాడు. స్కూటీని నడుపుతున్న ఇంద్రకంటి సుమంత్‌కు తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం 108 వాహనంలో నాగార్జునసాగర్ కమలానెహ్రూ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సుమంత్ మృతి చెందాడు. కాగా మృతులు వరుణ్ హైదరాబాద్‌లో డీజే ఆపరేటర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తుండగా, సుమంత్ హైదరాబాద్‌లోనే ఐటీఐ చదువుతున్నాడు. గత మూడు సంవత్సరాల క్రితం సుమంత్ తండ్రి ప్రసాద్, పది సంవత్సరాల క్రితం వరుణ్ తండ్రి భాస్కర్ సైతం మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను సాగర్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ సింగం రామ్మూర్తి తెలిపారు.


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన స్కూటీ


వరుణ్ (ఫైల్)


సుమంత్ (ఫైల్)

**బైక్ ఢీకొని..**

తిరుమలగిరి(నాగార్జునసాగర్): మండలంలోని అల్వాల గ్రామానికి చెందిన మిట్టపల్లి రాంబాబు (40) వృత్తి రీత్యా మండలంలోని డొక్కల బావితండాలో కిరాణ దుఖానం నడుపుతున్నాడు. రోజు వారి లాగానే గురువారం కూడా డొక్కలబావితండాకు వెళ్లి రాత్రి తిరిగి రాంబాబు అతని అన్న సుదర్శ ఇంటికి వస్తుండగా మండల కేంద్రంలోని శ్రీ శ్రీనివాస ఫంక్షన్‌హాల్ వద్దకు రాగానే రాంగ్‌రూట్‌లో అతివేగంతో వస్తున్న పల్సర్ బైక్ రాంబాబు ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీకొట్టడంతోరాంబాబు అతని అన్న సుదర్శన్ కింద పడిపోయారు. రాంబాబు తలకు తీవ్ర గాయాలు కాగా చికిత్స కోసం హాస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. మృతుని అన్న సుదర్శన్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ బాబు తెలిపారు.

**నర్సింహులగూడెంలో విషాదఛాయలు**

నిడమనూరు: మండలంలోని నర్సింహులగూడేనికి చెందిన ఇంద్రగంటి సుమన్ గౌడ్ (18), బానోతు వరుణ్ (బన్నీ)(17)లు శుక్రవారం పెద్దవూర మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి. నర్సింహులగూడెంలో శుక్రవారం జరిగే వివాహానికి హైదరాబాద్ నుంచి వస్తూ ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాంలో ఇద్దరూ మృతి చెందారు. ఇంద్రగంటి సుమన్ తండ్రి ప్రసాద్ డ్రైవర్‌గా జీవనం గడుపుతూ అనారోగ్యంతో 2021 ఏప్రిల్‌లో మృతి చెందాడు. సుమన్ సోదరుడు వంశీతో కలిసి తల్లి సరస్వతితో పాటు హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. సుమన్ అక్కడే డిగ్రీ చదువుతున్నాడు. బానావత్ వరుణ్ (బన్నీ) తండ్రి బానావత్ భాస్కర్ గత 12 సంవత్సరా క్రితం మృతి చెందాడు. అప్పటి నుంచి భాస్కర్ భార్య నర్సింహులగూడెం నుంచి రోజూ హాలియాకు వెళ్లి అక్కడ టైలరింగ్ చేస్తూ కుటుంబాన్ని పోసించుకుంటూ వస్తున్నది. వరుణ్‌కు కూడా సోదరుడు ఒకరు ఉన్నాడు. ఇద్దరి ఇండ్లూ 50మీటర్ల దూరంలోనే ఉండడం, ఇద్దరూ స్నేహితులు కావడంతో కలిసి మెలిసి తిరిగేవారు.

# ఎంచుకున్న రంగంలో పోరాడి పైకిరావాలి


నివేదిక పుస్తకాలను ఆవిష్కరిస్తున్న హైకోర్టు జడ్జి జస్టిస్ లక్ష్మణ్

బీబీనగర్ : ఎయిమ్స్ విద్యార్థులు ఎలాంటి వేధింపులకు, మనస్తాపాలకు గురి కాకుండా తాము ఎంచుకున్న రంగంలో పోరాడి పైకి రావాలని హై కోర్టు జడ్జి జస్టిస్ లక్ష్మణ్ సూచించారు. బీబీనగర్ ఎయిమ్స్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన మూడవ వార్షికోత్సవంలో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలో జరుగుతున్న చిన్న చిన్న సంఘటనలకు జీవతంలో జరిగే కష్టాలకు తరుచూ ఆవేదనకు గురికాకుండా మారుతున్న ఆధునిక కాలంలో ఆయా రంగాల్లో ఉండే విధానాల(సిస్టం)తో పోరాడాలని పిలుపునిచ్చారు. మెడికల్ విద్యార్థులు కళాశాలలో ఎలాంటి సంఘటనలు ఎదురైనా ధైర్యంగా ఎదుర్కొని తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలన్నారు. విద్యార్థులు క్రమ శిక్షణంతో మెలిగి మంచి ఫలితాలను సాధించాలన్నారు. ప్రతిష్టాత్మకమైన ఎయిమ్స్ వైద్య కళాశాలలపై ప్రజలకు ఎంతో నమ్మకం ఉందని దానిని వమ్ము చేయకుండా ఫ్యాకల్టీ వైద్యులు, మెడికల్ విద్యార్థులు దృష్టిలో ఉంచుకుని ముందుకు సాగాలన్నారు. యాదాద్రిభువనగిరి జిల్లాలో గల ఎయిమ్స్ నంబర్ 1గా నిలిచేలా అందరూ కృషి చేయాలన్నారు.

**నేను యాదాద్రి భువనగిరి జిల్లా వాసినే..**

తాను యాదాద్రిభువనగిరి జిల్లా వాసినే అని జడ్జి తెలిపారు. తమది వలిగొండ మండలం గోకారం గ్రామమని తెలిపారు. వ్యవసాయ కుటుంబంలో పుట్టిన తాను ఎంతో కష్టపడి పైకి ఎదిగానని చెప్పారు. తన కూతురు కూడా ఎంబీబీఎస్ చదుతోందని, సమాజానికి ఉపయోగపడే వైద్యులపై ఉన్న అభిమానంతో చదివిస్తున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్‌భాటియా, డీఎస్ రాహుల్ నారాణ్, మెడికల్ సూపరింటెండెంట్ నీరజ్ అగర్వాల్, వైద్య బృందం తదితరులు పాల్గొన్నారు.

# పేకాట స్థావరంపై పోలీసుల దాడి

చివ్వెంల(సూర్యాపేట) : పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఈ సంఘటన మండల పరిధిలోని కోమటి కుంట గ్రామంలో శుక్రవారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కోమటి కుంట గ్రామ శివారులో ఉన్నటువంటి గుట్ట పక్కన్న పలువురు పేకాట ఆడుతున్నారని సమాచారం తెలుసుకున్న పోలీసులు ఒక్కసారిగా దాడి చేశారు. దీంతో సంఘటన స్థలంలో రూ. 59 వేల నగదు, 6 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఎనిమిది మందిని ఆదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విష్ణు మూర్తి తెలిపారు.

# నాలుగు రోజులు ఇంట్లోనే మృతదేహం


శ్రీను (ఫైల్)

కేతేపల్లి : కుటుంబ తగాదాలతో ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి మృతదేహానికి నాలుగు రోజుల తర్వాత అంత్యక్రియలు నిర్వహించారు. ఈసంఘటన కేతేపల్లి మండలంలోని తుంగతుర్తిలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. మండలంలోని తుంగతుర్తి గ్రామానికి చెందిన గునగంటి శ్రీను(37) మాడ్గుల పల్లి మండలం పాములపహాడ్‌లో రైస్ మిల్లును కొనుగోలు చేసి కుటుంబంతో సహా ఏడేళ్లుగా అక్కడే నివాసం ఉంటున్నాడు. ఇటీవల ఆస్తి పంపకాల విషయంలో కుటుంబ సభ్యులతో తరుచూ గొడవలు జరుగుతున్నాయి. ఈనెల 6న పాములపాడుకు వెళ్లిన తల్లిదండ్రులు, సోదరుడు శ్రీనుతో గొడవపడ్డారు. ఈక్రమంలో శ్రీనుపై దాడి చేశారు. దీంతో మనస్తాపానికి గురైన శ్రీను అదే రోజు సాయంత్రం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శ్రీనుకు భార్య, ఇద్దరు పిల్లలు సంతానం ఉన్నారు. పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం ఈనెల 6న రాత్రి శ్రీను మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చారు. అయితే శ్రీను మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించటంతో పాటు, ఆస్తిని తన పిల్లల పేరిట రిజిస్టర్ చేయించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ శ్రీను భార్య తరుపు బంధువులు మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించేది లేదని అడ్డుకున్నారు. శ్రీను మృతికి కారణమైన నిందితులు పోలీసుల అదుపులో ఉన్నందున ఆస్తులు ప్రస్తుతం పిల్లల పేర రాయించేందుకు వీలు కాదని, అంత్యక్రియల నిర్వహించిన అనంతరం మాట్లాడుదామని చెప్పినా అంగీకరించ లేదు. చివరకు కుల పెద్దలు జోక్యం చేసుకుని న్యాయం చేస్తామని హామీ ఇవ్వటంతో శ్రీను మృతదేహానికి గురువారం అర్ధరాత్రి అంత్యక్రియలు నిర్వహించారు.

# హత్య కేసులో నిందితుడి అరెస్ట్

త్రిపురారం : హత్య కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని అంజనపల్లి గ్రామానికి చెందిన యర్రగొర్ల నగేష్(27) గొర్రెలు కాసుకుంటు జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 6వ తేదీ ఉదయం నుంచి నగేష్ కనబడలేదు. కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ దొరకలేదు. దీంతో నగేష్ సోదరుడు యర్రగొర్ల సతీష్ త్రిపురారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఈ నెల 7న పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. అనుమానంతో అదే గ్రామానికి చెందిన కంచుగంట్ల శ్రీనివాస్ అదుపులోకి తీసుకొని విచారించడంతో హత్య చేసినట్లు ఒప్పుకున్నాడు.


నగేష్ మృతదేహం

**పక్కా ప్రణాళికతోనే..**

అంజన పల్లి గ్రామానికి చెందిన యర్రగొర్ల నగేష్, కంచుగంట్ల శ్రీనివాస్‌లు గొర్రెలు కాసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇద్దరు కలిసి వారికి ఉన్న గొర్రెలు మేపడానికి ఇతర ప్రాంతాలకు సైతం వెళ్తున్నట్లు సమాచారం. అయితే యర్రగొర్ల నగేష్‌కు వివాహం కాలేదు. కంచుగంట్ల శ్రీనివాస్ భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. దీంతో కంచుగంట్ల శ్రీనివాస్‌కు అనుమానం కలిగి నగేష్‌ను హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. పక్కా ప్రణాళిక ప్రకారం శ్రీనివాస్ నగేష్‌ను తన ఇంటికి వచ్చేవిధంగా ప్లాన్ చేసుకున్నాడు. దీంతో రాత్రి సమయంలో ఇంటికి వచ్చిన నగేష్‌ను శ్రీనివాస్ ఇంటిలో కత్తితో పొడిచి హత్య చేశాడు. అనంతరం పశువుల కొట్టం వద్ద ఉన్న సెప్టిక్ ట్యాంక్ మూత పగలగొట్టి నగేష్ మృతదేహాన్ని పడవేసినట్లు పోలీసులు సమక్షంలో కంచుగంట్ల శ్రీనివాస్ ఒప్పుకున్నాడు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు శుక్రవారం సీఐ గాంధీ నాయక్, ఆర్ఐ రూన్సీ ఆధ్వర్యంలో నగేష్ మృతదేహాన్ని సెప్టిక్ ట్యాంక్ నుంచి బయటకు తీయించారు. మృతదేహం చుట్టు పాత వస్త్రాలు వేయడంతో కాస్త కుళ్లిపోయింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు.


యర్రగొర్ల నగేష్ (ఫైల్)

**అంజన పల్లిలో భారీ బందోబస్తు**

యువకుని హత్య జరగడంలో అంజన పల్లి గ్రామంలో సుమారు 50 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. నగేష్ మృతదేహాన్ని చూడడానికి గుంపులుగా వచ్చే ప్రయత్నం చేశారు. పోలీసులు గ్రామస్తులను చెదరగొట్టారు. దీంతో గ్రామంలో కాసేపు టెన్షన్ వాతావరణం నెకొంది. సెప్టిక్ ట్యాంక్‌లో యువకుని మృతదేహం దొరకడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



# రేషన్ బియ్యం పక్కదారి పట్టిస్తే చర్యలు


రేషన్ దుకాణాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మిర్యాలగూడ: రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ రామకృష్ణారెడ్డి హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని షాబునగర్‌లోని 5వ నెంబర్ రేషన్ దుకాణాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి బియ్యం నిల్వలను పరిశీలించారు. 15 క్వింటాళ్ల 25కిలోల బియ్యం తక్కువగా ఉండడంతో షాపు నిర్వాహకుడు గంధం శ్రీనివాస్‌పై 6ఏ కింద కేసు నమోదు చేసినట్లు, షాపులో ఉన్న బియ్యం నిల్వలను పక్కన ఉన్న మరో రేషన్ దుకాణానికి అప్పగించినట్లు తెలిపారు. రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసినా, అక్రమంగా తరలించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్డుదారుల నుంచి రేషన్ దుకాణాదారులు బియ్యం కొనుగోలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఇక మీదట ప్రతి రోజు రేషన్ దుకాణాలను తనిఖీ చేస్తామన్నారు. విధిగా ప్రతి రోజు రేషన్ దుకాణాలను తెరవాలన్నారు. ఆయన వెంట సివిల్ సప్లయ్ ఆర్ఐ సురేందర్‌సింగ్ ఉన్నారు.

## బైక్ అదుపుతప్పి దంపతులకు గాయాలు


చికిత్స పొందుతున్న బాధితుడు

చివ్వెంల(సూర్యాపేట) : అదుపు తప్పి బైక్ బోల్తా పడటంతో భార్యభర్తలకు గాయలయ్యాయి. ఈ సంఘటన మండల పరిధిలోని రోళ్లబంద తండ వద్ద శుక్రవారం సాయంత్ర జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం...సూర్యాపేట మండలం కాసరబాద గ్రామానికి సూర్యాపేట మండల ఆంధ్రజ్యోతి పత్రిక రిపోర్టర్ సాంబాచారి, ఆతని భార్య శైలజలు బైక్‌పై ఖమ్మం పట్టణంలో బంధువుల ఇంట్లో శుభకార్యంకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా మార్గ మధ్యలో సూర్యాపేట–ఖమ్మం రహదారి రోళ్లబండ తండా వద్ద ముందుగా వెళ్తున్న కారు ఒక్కసారిగా బ్రేక్ వేశాడు. దీంతో బైక్ అదుపు తప్పి కింద పడటంతో భార్య,భర్తలకు కాళ్లు,చేతులకు గాయలయ్యాయి. చికిత్స నిమిత్తం బాధితులను ఆస్పత్రికి తరలించారు.

## 'మిర్యాల'వాసికి డాక్టరేట్

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ పట్టణంలోని ఈదులగూడేనికి చెందిన గడ్డం లింగరాజుకు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ తెలుగు విభాగం డాక్టరేట్‌ను ప్రకటించింది. గడ్డం లింగరాజు 'కాలువ మల్లయ్య నవలలు–వస్తూ విశ్లేషణ' అనే అంశంపై ఆచార్య శరత్ జోష్నారాణి పర్యవేక్షణలో పరిశోధన చేశారు. కాగా గడ్డం లింగరాజు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఎంఏ, ఎంఫిల్, పీహెచ్‌డీ ఇక్కడే పూర్తి చేశాడు. లింగరాజు తల్లి చనిపోవడంతో పెద్దమ్మ–పెద్దనాన్న సోమమ్మ, లింగయ్యల వద్ద ఉండి వారి ప్రోత్సాహంతో చదువుకొని ఉన్నతమైన డిగ్రీని పొందాడు. లింగరాజు ప్రస్తుతం పట్టణంలోని ఎన్ఎస్‌పీ క్యాంపులో గల మేరెడ్డి రామచంద్రారెడ్డి స్మారక గ్రంథాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్, జూనియర్ లెక్చరర్ కోసం చదువుతున్నాడు. ఈ సందర్భంగా మేరెడ్డి రామచంద్రారెడ్డి స్మారక గ్రంథాలయం నిర్వాహకుడు కుమ్మరికుంట్ల సుధాకర్, తోటి స్నేహితులు మంజూనాయక్, రమావత్ శ్రీనునాయక్, నాగరాజు, హరిలు లింగరాజును అభినందించారు.

## గోడకూలి వ్యక్తి మృతి

నడిగూడెం : గోడ కూలి వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన నడిగూడెం మండలం శ్రీరంగాపురంలో జరిగింది. ఎస్ఐ ఏడుకొండలు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రెడ్డిమల్ల రమేష్ (32) ఈ నెల 9న అదే గ్రామానికి చెందిన శ్రీనివాస రావు ఇంటి వద్ద పని చేస్తుండగా ప్రమాదవశాత్తు గోడ కూలి మీద పడడంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుని భార్య శైలజ శుక్రవారం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృత దేహానికి కోదాడ ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి భార్య, కూతురు, కొడుకు ఉన్నారు.

# వేర్వేరు చోట్ల ఇద్దరి బలవన్మరణం

చివ్వెంల(సూర్యాపేట) : వేర్వేరు చోట్ల ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు. చివ్వెంల, పాలకవీడు మండలాల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. చివ్వెంల మండల పరిధిలోని కుడకుడ గ్రామానికి చెందిన పర్వతం బ్రహ్మాచారి (26) వృత్తీ రీత్యా డాక్యుమెంటరీ రైటర్ల వద్ద పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో కుటుంబ అవసరాల నిమిత్తం కొంతమంది వద్ద అప్పుచేశాడు. దీంతో ఆర్థిక ఇబ్బందులై ఎక్కువై ఇంట్లో ఉన్న ఎలుకల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం సూర్యాపేటకు తరలించగా ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు , మృతునికి భార్య, కుమార్తె ఉన్నారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

**ఉరేసుకుని కార్మికుడు..**

పాలకవీడు: ఉరేసుకుని యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన పాలకవీడు మండలంలోని మహంకాళిగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని భవానీపురంలో గల డెక్కన్ సిమెంట్ పరిశ్రమ లేబర్ కాలనీలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపి వివరాల ప్రకారం.. పశ్చిమ బెంగాల్‌కు చెందిన బిశ్వాస్(23) ఓ ప్రైవేటు సంస్థ ద్వారా డెక్కన్ పరిశ్రమలో కార్మికుడిగా పనికి చేరినట్లు తెలిపారు. రోజూ మాదిరిగా పనులకు వెళ్లాల్సిన బిశ్వాస్ కాలనీ సమీప ప్రాంతంలో చెట్టుకు ఉరి వేసుకుని బలన్మరణానికి పాల్పడ్డాడు. తోటి కార్మికులు గమనించి యాజమాన్యానికి తెలపడంతో పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతికి గల కారణాలను విచారిస్తున్నారు. జీడీసీఎల్ ప్రైవేటు సంస్థకు చెందిన హెచ్ఆర్ మేనేజర్ ఇచ్చినే ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని హుజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై సైదులు వెల్లడించాడు.

# చికిత్స పొందుతున్న తాపీమేస్త్రీ మృతి


యాదయ్య మృతదేహం

కట్టంగూర్ : చికిత్స పొందుతూ తాపీ మేస్త్రీ మృతిచెందాడు. ఈ ఘటన మండలకేంద్రంలోని ఇందిరమ్మకాలనీలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఇందిరమ్మ కాలనీకి చెందిన పాలడుగు యాదయ్య(50) కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో మానసికంగా బాధపడుతూ ఉండేవాడు. అనారోగ్య సమస్యతో విసుగెత్తి గురువారం తన ఇంటి సమీపంలో ఉన్న కంపచెట్ల వద్దకు వెళ్లి గడ్డిమందు తాగాడు. గమనించిన చుట్టుపక్కల వారు కుటుంబ సభ్యులకు తెలిపారు. వెంటనే కుటుంబ సభ్యులు యాదయ్యను 108 వాహనంలో నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి పరిస్థితి విషమంగా ఉందని హైదరాబాదుకు తీసుకెళ్లాలని సూచించారు. మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు అదే రోజు రాత్రి గాంధీ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడని వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి కూతురు అశ్విని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ డి. విజయ్‌కుమార్ తెలిపారు.



# మిరప కోతలో మెళకువలు

- పెద్దవూర మండల వ్యవసాయ అధికారి సందీప్‌కుమార్ సూచనలు

పాడి పంట

పెద్దవూర : మిరప పంటను ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విస్తారంగా సాగు చేస్తున్నారు. మిరప పంట ఇప్పుడిప్పుడే పండుగా మారుతుండటంతో రైతులు మిరప కాయలను కోసేందుకు సిద్ధమవుతున్నారు. ఎండుమిర్చికి మార్కెట్‌లో క్వింటా రూ.20వేలకు పైగా అమ్ముడు పోతున్నాయి. మిరప కోత, ఆరబెట్టే సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోకుంటే రైతులు నష్టాన్ని చవిచూడాల్సి వస్తుందని మండల వ్యవసాయ అధికారి కె.సందీప్‌కుమార్ తెలిపారు. మిరప కోత, ఆరబెట్టే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఆయన మాటల్లోనే..

మిరప రైతులు ఎకరానికి 20 నుంచి 30 క్వింటాళ్ల దిగుబడి సాధిస్తున్నా నాణ్యత లేకపోవడంతో నష్టాలను చవిచూడాల్సి వస్తుంది. సరైన సమయంలో కోతలు కోయక, కల్లాల్లో వర్షానికి, మంచుకు కాయలు తడిస్తే నాణ్యత తగ్గుతుంది. మార్కెట్లో ధరలు లేక ఎగుమతులకు పనికిరాక, వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేయడం వంటి కారణాలతో రైతులు నష్ట పోతున్నారు. పంట మార్పిడి చేయకపోవడం, విచక్షణారహితంగా పురుగు మందులను పిచికారీ చేయడం, పండిన మిరప కాయలు ఎప్పటికప్పుడు తెంచకపోవడం వంటి కారణాలతో కాయ నాణ్యత లోపిస్తుంది.


తెల్ల మిరప కాయలు వేరుచేస్తున్న కూలీలు


కె.సందీప్‌కుమార్, ఏఓ, పెద్దవూర

**ఆరబెట్టడం ఇలా..**

కొన్నిసార్లు కోతల సమయంలో వర్షాలు కురిస్తే సకాలంలో కోతలు జరగక కోసిన వాటిని సరైన సమయంలో ఎండబెట్టక పోవడంతో నాణ్యత లేని మిర్చిగా మారిపోతుంది. ఫలితంగా మార్కెట్లో కాయలకు సరైన ధర రాక నష్టపోవాల్సి వస్తుంది. మిరప కాయల్ని ఎండబెట్టే కల్లాల్ని గట్టి భూమి ఉండే ప్రదేశంలో ఏర్పాటు చేసుకోవాలి. దుమ్ము ఎక్కువగా లేని, కొద్దిగా ఏటవాలుగా ఉండే ప్రదేశాన్ని ఎంచుకోవాలి. నీళ్లు వెళ్లే వైపు కల్లం పొడవుగా ఉండాలి. వర్షం పడినప్పుడు పైనీళ్లు కల్లం పైకి రాకుండా కల్లం చుట్టూ అడుగున్నర ఎత్తు కట్ట ఏర్పాటు చేసుకోవాలి. తోట విస్తీర్ణం, దిగుబడిని బట్టి కల్లం పొడవు, వెడల్పులను తయారు చేసుకోవాలి. వర్షాలు పడ్డప్పుడు పరదాలు కప్పుతాం కాబట్టి నీరు తీసివేయడానికి అనుకూలంగా ఉంటుంది. దాదాపు 10 క్వింటాళ్ల మిరప 30 అడుగుల వెడల్పు, 60 అడుగుల పొడవు గల కల్లం తయారు చేసుకోవాలి. కల్లం సైజును బట్టి టార్పాలిన్ కవరు తెచ్చుకోవాలి. ప్రతిరోజు కోసే కాయల్ని కుప్పలుగా పోసి మరుసటి రోజు ఉదయం మంచు తగ్గగానే పలుచగా పోసి ఆరబెట్టాలి. ప్రతిరోజు సాయంత్రం ఆరబెట్టిన మిరప కాయల్ని కుప్పగా పోసి టార్పాలిన్ కవర్ కప్పి కాయలపై మంచు పడకుండా జాగ్రత్త తీసుకోవాలి. ఇలా చేస్తే గాలి, వెలుగురు బాగా ప్రసరించి కాయలు త్వరగా ఎండుతాయి. కాయలు బాగా ఎండకముందే తెల్ల కాయలు వేరుచేయాలి. కాయల్లో 5 శాతం తేమ ఉన్నప్పుడే వాటిని మండె పోసి గోనె సంచులతో కప్పాలి. మార్కెట్‌కు తీసుకెళ్లే రోజు ఉదయం శుభ్రమైన ఖాళీ సంచుల్లో వాటిని నింపాలి. ఒక్కో సంచిలో 40 కిలోల కాయల కన్నా ఎక్కువ నింపకూడదు. ఎక్కువ కాయల్ని సంచిలో తొక్కితే కాయ నాణ్యత చెడిపోయి మార్కెట్‌లో సరైన ధర రాదు. కోత సమయంలో ఈ విదమైన చర్యలు చేపడితే నాణ్యమైన పంటతో పాటు మార్కెట్లో అధిక ధర పలుకుతుంది.

**కోత విధానం..**

మిరపతోటలో కొన్ని కాయలు పండిన వెంటనే కూలీలతో కోస్తే, చెట్టు విరిగిపోయి తోటకు నష్టం కలుగుతుందని రైతులు భావిస్తున్నారు. చాలా కాయలు పండిన తరువాత ఒకేసారి కోయవచ్చునని మరికొంత మంది రైతులు భావించి కోతను ఆలస్యం చేస్తుంటారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆకాల వర్షాలు కురిస్తే పండిన కాయలు రాలిపోతాయి. మంచు వల్ల కూడా కాయలు రాలిపోయే అవకాశం ఉంది. ఒక్కోసారి తెల్లకాయలు ఎక్కువగా వస్తుంటాయి. మొక్కల ఎదుగుదల తగ్గుతుంది. అందువల్ల రైతులు తోటలో కోతకు వచ్చిన కాయల్ని విడతల వారీగా కోసి నాణ్యత గల కాయల్ని మార్కెట్‌కు పంపాలి. పండిన కాయల్ని వెంటనే కోస్తే తెల్లకాయలు ఎక్కువగా రావు. కాయకోత తరువాత ఎరువులు వేసి, నీటి తడి పెడితే అదనంగా మొక్కకు కాయ వచ్చి దిగుబడి పెరుగుతుంది. రైతులు కనీసం కాయలను ఆరు, ఏడు దఫాలుగా కోయాలి.